క్లుప్తంగా

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసిన బగళాముఖి బండ్లమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎర్ర గులాబీలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి సారెలను సమర్పించారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

నేడు జగనన్న సురక్ష క్యాంపులు

వేమూరు: మండలంలోని కుచ్చెళ్లపాడు, బలిజేపల్లి గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామ సచివాలయం-1, 2లో జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగుణమ్మ తెలిపారు.

ఇంటి వద్దకే ధృవపత్రాలు

పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల అర్బన్: పట్టణంలోని రైలుపేట, తహసీల్దారు కార్యాలయ రోడ్డులో ఉన్న వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని, ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా సచివాలయాల ద్వారా 11 రకాల ధృవీకరణ పత్రాలు అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. బాపట్ల పట్టణ మండలాధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, చేజర్ల నారాయణ రెడ్డి, పీర్, మున్సిపాలిటీ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, ఆర్వో సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్ చింతల రాజశేఖర్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ మాట్లాడుతూ రైలు పేట సచివాలయ పరిధిలో మొత్తం 579 దరఖాస్తులు రాగా, అందులో 559 మందికి సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తహసీల్దారు రోడ్డులోని సచివాలయ పరిధిలో 375 దరకాస్తులు రాగా, 373 మందికి సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని వెల్లడించారు.

ఇంటి స్థలానికి అర్చకులు దరఖాస్తు చేసుకోవాలి

పిట్టలవానిపాలెం: అర్చకులు నివేశన స్థలాల కోసం దరకాస్తు చేసుకోవాలని బాపట్ల జిల్లా అర్చక సంఘ నాయకులు బృందావనం గోపీచంద్ తెలిపారు. చందోలులో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిరుపేదలైన అర్చకులకు నివేశన స్థలాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను సోమవారం ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్) జీజీహెచ్ శాఖ అధ్యక్షుడు వి.యోహాన్ ఆధ్వర్యంలో పలువురు యూనియన్ నాయకులు కలిసి శాలువా కప్పి సత్కరించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా ఆసుపత్రిలో చేసిన వైద్య సేవల గురించి యూనియన్ నేతలు కొనియాడారు. అభినందనలు తెలిపిన వారిలో యూనియన్ నాయకులు నమ్రత్‌కుమార్, ఎం.వి.రత్నం, గాబ్రియేల్, సుబ్బారావు, తిరుమలాదేవి, సుశీల్‌కుమార్, మనోజ్‌కుమార్, మేడిదబాబు తదితరులు ఉన్నారు.

సిరంజ్‌లు అందజేస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

నూతనంగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిరణ్‌కుమార్‌ను ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలిసి శాలువా కప్పి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. రోగుల వినియోగం కోసం గ్లౌజులు, సిరంజ్‌లు ఏపీ ఎన్జీవో నేతలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ సతీష్ కుమార్, నగర అధ్యక్షుడు సూరి, నగర సెక్రటరీ కళ్యాణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, వెల్లంపల్లి పద్మజ, బెల్లంకొండ శైలజ, రాధారాణి, కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్, గాబ్రియేల్ పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



బాబాకు మొక్కుకుంటున్న ఎంపీ మోపిదేవి



కొల్లూరులో ప్రత్యేక అలంకరణలో అనంత భోగేశ్వరస్వామి

- సాయినాథునికి భక్తుల ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో భక్తులు అన్న సంతర్పణలు

రేపల్లె: ఆషాఢ మాసం శుద్ధ పౌర్ణమి సోమవారం గురుపౌర్ణమి పర్వదినాన్ని సాయినాథుని ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. సాయినాథుని విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుష్పాలు, పట్టు వస్త్రాలతో బాబాను సుందరంగా అలంకరించారు. అన్ని ఆలయాల్లో అన్న సంతర్పణ చేశారు. రేపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని సాయినాథుని ఆలయ ఆవరణలో సాయంత్రం కర్పూరంతో అఖండ జ్యోతిని వెలిగించారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త బాబాను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకోటి పేటలోని సాయినాథుని ఆలయంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్న సంతర్పణకు రూ.30 వేలు విరాళం అందించారు.

అనంత భోగేశ్వరునికి ప్రత్యేక పూజలు

కొల్లూరు: కొల్లూరు బ్రహ్మ సూత్ర సహిత అనంత భోగేశ్వరుడికి గురు పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకాలు చేశారు. లక్ష బిళ్వార్చన నిర్వహించారు. అర్చకులు కొమ్మూరు వెంకటశివప్రసాద్, అనంతేశ్వర భరద్వాజ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ చైర్మన్ యడ్ల వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ అనుపమలు పర్యవేక్షించారు.

ఘనంగా గురుపౌర్ణమి పూజలు

కర్లపాలెం: కర్లపాలెంలోని సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో షిర్డీ సాయిబాబా విగ్రహానికి, సత్యసాయి చిత్ర పటాలకు భక్తులు పూజలు నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితిలో విశేష పూజలు జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు పేరాల వెంకటసురేష్ దంపతులు సాయిబాబా దేవాలయాలలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యాయులకు సన్మానం చేసింది.

ఆకట్టుకున్న బాబా చిత్రరూపం

భట్టిప్రోలు: విఠలేశ్వరనగర్ పద్మశాలీ కాలనీలోని శ్రీ సీతారామ మందిరంలో సాయినాథుని చిత్రాన్ని పుష్పాలు, రంగులతో అందంగా తీర్చిదిద్దారు. చుట్టూ దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. బాబావారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకర్షించింది.

సామూహిక సాయి వ్రతం

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాయిబాబా మందిరంలో సాయినాథ-దత్తాత్రేయ స్వామి వార్ల గురుపౌర్ణమి వేడుకల్లో సోమవారం సుప్రభాతం, కాగడ హారతి, ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరిగాయి. 1500 మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో సామూహిక సాయి వ్రతాలు నిర్వహించారు. 21 మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో గురుపూజోత్సవం

బాపట్ల అర్బన్: గురు పూర్ణిమను పురస్కరించుకొని పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న షిర్డీ సాయిబాబా దేవాలయంలో గురు పూజోత్సవ వేడుకలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు మోహన రత్న సాయి, సాయికిరణ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో 24ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గణిత శాస్త్ర పరిశోధనల్లో రాణించిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ కేవీఎల్ ఎన్.ఆచార్యులను ఘనంగా బాపట్ల షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు సత్కరించారు.

బాబాకు ప్రత్యేక పూజలు

నగరం: మండలంలోని ఈదుపల్లి శివారు సాయి నగర్‌లోని షిర్డి సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వీరరాఘవ పేటలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

గురువులకు సన్మానం

చెరుకుపల్లి: మండల కేంద్రం వీర రాఘవ పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం గురు పూర్ణిమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు.. చిలుకోటి లక్ష్మీ నారాయణ, పరదామ కోటేశ్వరరావు, ఆర్‌వీఎస్ ఆంజనేయ శర్మ పలువురు గురువులను సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బాబా ప్రత్యేక అలంకరణతో భక్తులు



వేమవరంలో సామూహిక సాయి వ్రతంలో మహిళలు



బాపట్లలో బాబాకు ప్రత్యేక పూజలు

కనిపించే దేవుడు జగనన్న

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



ఎంపీ మోపిదేవి వెంకట రమణారావుకు ఆధార్‌కార్డు అందజేస్తున్న సచివాలయం సెక్రటరీ

రేపల్లె రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ.. జనరంజక పాలన అందిస్తున్న జగనన్న కనిపించే దేవుడని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ పేర్కొన్నారు. పట్టణంలోని 2, 3 వార్డుల సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగలేని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ఓ వరంలాంటిదన్నారు. సాధారణ రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు వివిధ రకాల సర్టిఫికెట్లు 50వేలు జారీ అవుతుంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో రోజుకు 5 లక్షలకు పైగా సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. వీటన్నిటినీ ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రభుత్వ చలానాలు, జన్మభూమి కమిటీలకు లంచాలు సమర్పించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. రెండు మూడు వార్డు సచివాలయాల పరిధిలో 634 సర్టిఫికెట్లను ఎంపీ మోపిదేవి అందజేశారు. స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైఎస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్లు చదలవాడ శ్రీనివాసరావు, గొరికపూడి మాదవి పాల్గొన్నారు. బేతపూడి -2 సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు 540 సర్టిఫికెట్‌లను, చాట్రగడ్డ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి 373 సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.

ఇక ఎంపీ మోపిదేవి చిరునామా రేపల్లె

రేపల్లె రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధార్ కార్డును పొందారు. నిజాంపట్నం స్థిర నివాసంగా చిరునామా ఉన్న కార్డును మార్పులు, చేర్పులతో జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుని, రేపల్లె పట్టణ చిరునామాతో సోమవారం సచివాలయం ద్వారా నూతన కార్డును పొందారు.

శంకర విద్యాలయం విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు నగదు, దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: శంకర విద్యాలయం విద్యార్థులకు పురస్కారాలు అందించేందుకు యడ్లవల్లి ధర్మసత్రం ముందుకురావటం అభినందనీయమని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ధర్మసత్రం అధ్వర్యంలో శంకర విద్యాలయంలో 32 మంది వేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,116లు, దుస్తులను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. గుంటూరులోని కొత్తపేటలోని యడ్లవల్లివారి ధర్మసత్రం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కన్వీనర్ టి. సుభద్ర, డైరెక్టర్లు యనమండ్రు సాయి సురేష్, బడేకర్ అనుపమ నాగరాజు, వేములపాటి దాశరథి, శ్రీ శంకర్ విద్యాలయం సెక్రెటరీ చలపతిరావు, జాయింట్ సెక్రెటరీ భుజేంద్ర మౌళి, బాబు నాగేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- నిజాంపట్నంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



స్థానిక మహిళను పలకరించి, సంక్షేమ లబ్ధిని వివరించిన ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం గ్రామ సచివాలయం-2 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవ రత్నాలను ప్రవేశ పెట్టి సమర్థవంతంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని.. ఆయా రాష్ట్రాల ప్రతినిధులు మన రాష్ట్రానికి వచ్చి, అమలు తీరు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మోపిదేవి హరినాథబాబు, ప్రసాదం వాసుదేవ, సర్పంచ్ పోలేరమ్మ, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, మత్స్యకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నా భూశంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి మేరుగ

- పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై తుదిదశకు చేరుకున్న వంతెన నిర్మాణం
- ఆలపాటినగరం వాసులకు తగ్గిన 2కిలో మీటర్ల దూరాభారం
- పొలం పనులకు, పశువుల మేతకు తీరిన కష్టాలు



పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై చివరి దశకు చేరుకున్న పుట్‌బ్రిడ్జ్ నిర్మాణం

కొల్లూరు : కనుచూపు మేరలో ఉన్న దూరాన్ని కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితితో ఇబ్బందులు పడుతున్న ఆలపాటినగరం వాసుల కష్టాలు ఇక తీరనున్నాయి. గ్రామానికి ఆనుకుని ప్రవహిస్తున్న పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై నడక వంతెన లేకపోవడంతో సుమారు 2 కిలో మీటర్లు ప్రయాణంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దోనేపూడి శివారు ఆలపాటినగరంలో సుమారు 350మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ అధిక శాతం వ్యవసాయ కూలీలే జీవిస్తున్నారు. గ్రామం వెంబడి ఉన్న కరకట్ట దిగువున లంక భూముల్లో పనులే జీవనాధారం. పశ్చిమ బ్యాంక్ కెనాల్ అడ్డుగా ఉండటంతో వీరు దోనేపూడి వెళ్లి.. తిరిగి కరకట్ట మీదుగా తమ గ్రామం దాటి రెండు కిలో మీటర్లు కాళ్లకు పనిచెబితే గాని రోజువారి పనులకు చేరుకోని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వంలో కాలువపై పుట్ బ్రిడ్జ్ నిర్మాణానికి ఎన్ని అర్జీలు పెట్టినా అవి బుట్టదాఖలయ్యాయి. గత ఎన్నికల సమయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అధికారంలోకి వచ్చాక పుట్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను విస్మరించకుండా అధికారంలోకి రాగానే.. పుట్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను ప్రారంభించి, పూర్తి చేశారు. గ్రామస్తులు ప్రయాణ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపారు. బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి మేరుగ నాగార్జున విన్నపం మేరకు.. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు రూ.20 లక్షలు మంజూరు చేయడంతో పనులు చివరి దశకు చేరుకున్నాయి.


ప్రయాణ కష్టాలు తీరాయి..



వ్యవసాయ కూలి పనులకు లంక భూములకు చేరుకోవాలన్నా, పశుగ్రాసం తెచ్చుకోవాలన్నా.. 2 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావాలి. వంతెన నిర్మాణంతో దూరం తగ్గింది. ఈ వంతెన కోసం ఏళ్లుగా ఎదురు చూశాం.

– కూచిపూడి సుగుణ, ఆలపాటినగరం.

ఇంటిలో చోరీ



నడింపాలెం (ప్రత్తిపాడు): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ సహా ఇంటిలో బీరువాలోని బంగారం ఆభరణాలు, నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. ప్రత్తిపాడు మండలం నడింపాలెం సాయిప్రభు కాలనీకి చెందిన మాలెంపాటి వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి, వరండాలో నిద్రపోయాడు. సోమవారం తెల్లవారుజామున లేచి చూసేప్పటికీ ఇంటి ముందు బైక్ కనిపించకపోవడంతో పాటు, ఇంటి లోపల బీరువా తలుపులు తెరిచి ఉండటాన్ని వెంకటేశ్వర్లు గమనించాడు. బీరువాలో ఉండాల్సిన బంగారు చెవి పోగులు, మొబైల్, రూ.6 వేల నగదు లేకపోవడంతో ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ డి.రవీంద్ర బాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 4న మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్స్ హాస్పిటల్ నుంచి కిసాన్ నగర్ వరకు, గరువురోడ్డు, ఉప్పూడి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, నిజాంపట్నం రోడ్డులో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

నేడు చందోలులో 'జగనన్న సురక్ష'

పిట్టలవానిపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆమె విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 8 గంటలకు చందోలు-1, 2 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు 11 రకాల ధృవీకరణ పత్రాల మంజూరు, ప్రభుత్వ పథకాల సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఈ కార్యక్రమాలలో పాల్గొంటారని చెప్పారు. ఈవోపీఆర్డీ కె.పద్మజ పాల్గొన్నారు.

నేడు గాంధీ, రోశయ్య విగ్రహాల ఆవిష్కరణ

వేమూరు: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 90వ జయంతి సందర్భంగా వేమూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మహాత్మా గాంధీ, కొణిజేటి రోశయ్య విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుందని మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

పిట్టలవానిపాలెం: విత్తన కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సత్యానంద్ సూచించారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల నుంచి మాత్రమే విత్తన కొనుగోళ్లు చేయాలని తెలిపారు. బిల్లు తీసుకుని, పంట పూర్తయ్యే వరకు దాచుకోవాలని చెప్పారు. విత్తన డీలర్లు విత్తన రకం, స్టాకు వివరాలు తప్పనిసరిగా బ్లాక్ బోర్డులో ప్రదర్శించాలని స్పష్టం చేశారు. స్టాకు రికార్డులను తనిఖీకి వచ్చిన అధికారులకు చూపించాలని పేర్కొన్నారు.

దబ్బకూటి వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే కోన నివాళి

పిట్టలవానిపాలెం: గోకరాజు నల్లిబోయినవారి పాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దబ్బకూటి మాధవరావు తండ్రి వెంకటేశ్వర్లు దశదిన కర్మకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదివారం హాజరయ్యారు. సర్పంచ్ మాధవరావును పరామర్శించారు. వెంకటేశ్వర్లు చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్విని తదితరులు ఉన్నారు.

బారికేడ్లను ఢీకొని.. ఇద్దరికి గాయాలు

కర్లపాలెం: జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన బారికేడ్లను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం కర్లపాలెంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సాంబ శివరావు వివరాల మేరకు.. నల్లమోతువారిపాలేనికి చెందిన వేణుబాబు, కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై కర్లపాలేనికి వస్తూ ముకుంద టీస్టాల్ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న బారికేడ్లను ఢీకొట్టారు. దీంతో కిందపడిన ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరినీ.. బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.